భక్తులకు ఇబ్బందులు రానివ్వొద్దు

మేయర్ విజయలక్ష్మి



నిమజ్జన కొలనును పరిశీలిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

మన్సూరాబాద్: నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు చేపట్టాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆదేశించారు. గురువారం ఆమె వివిధ శాఖల అధికారులతో కలిసి మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలోని నిమజ్జన కొలనును పరిశీలించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ జీహెచ్ఎంసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుందని కొలనుల వద్ద క్రేన్లతో పాటు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిమజ్జన దారిలోని ఉన్న రోడ్లపై గుంతలను పూడ్చివేస్తున్నామని, వీధీ దీపాలతో పాటు చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, భక్తులు వినాయక నిమజ్జనాన్ని సంతోషంగా జరుపుకోవటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్, డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఇంజినీరింగ్ సూపరింటెండెంట్ అశోక్‌రెడ్డి, జాయింట్ కమిషనర్ కృష్ణకుమారి, డిప్యూటీ హార్టీకల్చర్ అన్నపూర్ణ, జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఎలక్ట్రికల్ డీఈ పున్నానాయక్, డిప్యూటీ డైరెక్టర్ వెటర్నరీ రంజిత్ పాల్గొన్నారు.

నాగోలు చెరువు సందర్శన..

నాగోలు: గణేష్ నిమజ్జనలు ప్రశాంతంగా జరుపుకోవాలని మేయర్ విజయలక్ష్మి సూచించారు. గురువారం ఆమె ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ పాటిల్, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్‌తో కలిసి హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో ఉన్న నాగోల్ చెరువును సందర్శించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కాలనీవాసులకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు.

మినీట్యాంక్ బండ్ సందర్శించిన మేయర్

చైతన్యపురి: సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌ను గురువారం మేయర్ గద్వాల విజయలక్ష్మి జీహెచ్ఎంసీ అధికారులు, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. సరూర్‌నగర్ కట్టపై వేసిన ఫ్లోరింగ్ టైల్స్ పూర్తిగా ధ్వంసమైనా అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు మేయర్ దృష్టికి తెచ్చారు. చెరువులో బురద పేరుకుపోవటంతో వినాయక విగ్రహాలు కూడా మునగడం లేదని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయగా రెండు మూడు రోజులలో పనులు పూర్తి చేయాలని మేయర్ ఆదేశించారు. అనంతరం మట్టి ప్రతిమలను అందజేశారు.



శాలివాహననగర్ భాష్యం స్కూల్ వద్ద..

రోడ్లన్నీ ధ్వంసం.. అధికారుల చోద్యం

ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. మూసారంబాగ్ డివిజన్ పరిధిలో ఎటు చూసినా గుంతలమయమైన రోడ్లే దర్శమిస్తున్నాయి. శాలివాహననగర్ భాష్యం స్కూల్ చౌరస్తా, మలక్‌పేట నుంచి సలీంనగర్‌కు వెళ్లే దారి, మలక్‌పేట ఆర్టీఏ ఆఫీసు పక్కన భారత్ పెట్రోల్ పంపు సమీపంలో, ఫ్రెండ్స్‌కాలనీ, మూసారంబాగ్ బ్రిడ్జి బీజేఆర్ విగ్రహం సమీపంలో, దిల్‌సుఖ్‌నగర్ భవానినగర్ రోడ్, శాలివాహననగర్ హాస్పిటల్ ప్రాంతాల్లోని రోడ్లపై రాకపోకలు సాగించాలంటే సాహసం చేయాల్సిందేనని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షలతో నిర్మించిన రోడ్లు నాణ్యత లేకపోవడంతో ప్రజాధనం వృథా అవుతోందని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో సంబంధిత అధికారులు పర్యటించి ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. -మలక్‌పేట



సలీంనగర్‌కు వెళ్లే దారిలో..



మూసారంబాగ్ హెగ్డే ఆసుపత్రి పక్క లైన్‌లో..

నలుగురి జీవితాల్లో తేజస్సు



తేజ (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు ఓ యువకుడు. జీవన్‌ధాన్ ప్రతినిధుల వివరాల ప్రకారం.. మీర్‌పేట టీఎస్ఆర్‌నగర్‌కు చెందిన కందికంట్ల తేజ (20) ఆగస్టు 17న బైక్ వెళుతుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన తేజను కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆసుపత్రికి ఆ తర్వాత కామినేని హాస్పిటల్‌కు తరలించగా ఆరు రోజుల పాటు ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. ఆ తర్వాత చికిత్సకు స్పందించకపోవడంతో బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు తేజ తండ్రి రవి, తల్లి రజిత సోదరుడు పవన్‌కుమార్‌కు అవయవదానంపై అవగాహన కల్పించగా వారు ఒప్పుకోవడంతో తేజ లివర్, రెండు కిడ్నీలు, గుండెను జీవన్‌ధాన్‌కు దానం చేశారు. గుండెను గ్రీన్‌చానల్ ఏర్పాటు చేసి గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్‌కు తరలించారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



ఉపేందర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీలోని సాయినాథ మందిరంలో కొలువైన సాయినాథునికి విగ్రహానికి కాంగ్రెస్ నాయకుడు ఉపేందర్‌రెడ్డి సంహాసనాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మందిరం కమిటీ సభ్యులు ఉపేందర్‌రెడ్డి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రఘువీర్, దయాకర్ రెడ్డి, క్రిష్ణరామ్, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్, రీతూ, సునీలా, సుధా, అన్నపూర్ణ, ఉమా పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి



నరేష్, ఇన్‌స్పెక్టర్

మలక్‌పేట: శాంతి భద్రతల సమస్య రానివ్వకుండా ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండపాల నిర్వాహకులు, కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలని మండపాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలని రాత్రి సమయంలో కనీసం ముగ్గురు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఉత్సవాలు ముగిసే వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద నిర్వాహకులు, కమిటీ వివరాలు, ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు.

ఆక్రమణల తొలగింపు



ర్యాంపులను తొలగిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్దచెరువులోని నిమజ్జన కొలనులో సాగే నిమజ్జనాలకు వచ్చే వినాయకులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మన్సూరాబాద్ చౌరస్తా నుంచి ఆదిత్యానగర్, భవానీనగర్, మధురానగర్‌కాలనీలో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన ర్యాంపులను గురువారం హయత్‌నగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ పావనీ పర్యవేక్షణలో తొలగించారు. మన్సూరాబాద్ పెద్దచెరువు వరకు రోడ్డు ఆక్రమణలను కూడా తొలగించారు.

పాత స్నేహితులను కలుసుకోవడం ఆనందంగా ఉంది



సుభాష్‌చందర్జీ కుటుంబ సభ్యులతో ఇంద్రసేనారెడ్డి

సైదాబాద్: పాత స్నేహితులను కలుసుకోవడం సంతోషాన్నిస్తుందని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. సైదాబాద్‌లో నివసించే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ నివాసానికి వెళ్లి కలుసుకున్నారు. గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, సుభాష్‌చందర్జీ ఇరువురు పాత జ్ఞాపకాల గురించి ముచ్చటించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి, జంగం శ్వేతమధుకర్‌రెడ్డి, బొక్కా భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, నాయకులు కడారి రామ్‌కుమార్, గోపి పాల్గొన్నారు.

పార్క్ సమీపంలోని స్థలాన్ని పరిశీలించిన 'హైడ్రా' అధికారులు



వివరాలు తెలుసుకుంటున్న హైడ్రా అధికారులు

నాగోలు: కొత్తపేట డివిజన్ శ్రీరామలింగేశ్వర కాలనీలోని తెలంగాణ పార్క్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని హైడ్రా అధికారులు పరిశీలించారు. కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ వారం క్రితం హైడ్రా కమిషనర్ రంగనాథ్ కలిసి ఆక్రమణకు గురైన స్థలాలపై చర్యలు తీసుకోవాలని చేసిన ఫిర్యాదు మేరకు గురువారం ఎమ్మార్వో హేమ, అధికారులు సతీష్, ఉప్పల్ ఎమ్మార్వో వాణిరెడ్డి, సర్వేయర్ వెంకటేష్ కొత్తపేటలోని పార్క్ స్థలాన్ని పరిశీలించారు. గతంలో 3 ఎకరాల 12 గుంటల ప్రభుత్వ స్థలం ఉండేదని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. క్షేత్రస్థాయిలో సర్వేచేసి తగిన చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు వెల్లడించారు.

బాధితులకు అండగా ఉంటాం

నాగోలు: స్పెక్ట్రా రియల్ ఎస్టేట్ యాజమాన్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ డిమాండ్ చేశారు. గురువారం ఎల్‌బీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేద మధ్య తరగతి ప్రజల నుంచి ప్లాట్ల పేరుతో మోసం చేసి లక్షలాది రూపాయాలు తీసుకున్న స్పెక్ట్రా యాజమాన్యం తిరిగి ఇచ్చే వరకు పోరాడుతామన్నారు. ఈ సమావేశంలో కృష్ణ, మద్దిలేటి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించుకుందాం



మట్టి విగ్రహాలను అందజేస్తున్న దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

లింగోజీగూడ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలని లింగోజీగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి కోరారు.జీహెచ్ఎంసీ ఉచితంగా అందజేస్తున్న మట్టి వినాయకుల ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం వార్డు కార్యాలయంలో రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. వినాయక ఉత్సవాలకు డివిజన్ పరిధిలోన ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి వార్డు కార్యాలయంలో ఉచితంగా మట్టి గణపతులను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి, కరుణ్‌కుమార్, రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాగోలు చెరువు వద్ద మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న మేయర్ విజయలక్ష్మి

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



కాలనీవాసులతో మాట్లాడుతున్న సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని వేంకటేశ్వర కాలనీలో పర్యటిస్తూ స్థానికులతో మాట్లాడారు. గత కొన్నిరోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లుతూ రోడ్లపై మురుగు పారుతుందని వెంటనే మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడంతో సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గయ్యగౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

మేముసైతం.. పోజులిస్తాం



దిల్‌సుఖ్‌నగర్ : కొత్తపేటలోని శివాని మహిళా కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థినులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ఫ్యాషన్ షోలో విద్యార్థినులు మోడల్స్ తరహా పోలిజిచ్చి ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరస్పాండెంట్ వెదిరె సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ..విద్యార్థులు పట్టుదలతో చదివితే లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు ప్రేమ్‌నాథ్ రెడ్డి, సాంబశివరావు, ప్రిన్సిపల్ అనిత పాల్గొన్నారు.

ఓటు బ్యాంకుగా వాడుకోవడం సరికాదు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీని బీఆర్ఎస్ పాలకులు ఓటు బ్యాంకుగా రాజకీయాలకు వాడుకొని అభివృద్ధి చేయడం మరిచారని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్ఆర్) విమర్శించారు. జల్‌పల్లిలో గురువారం పర్యటించిన ఆయన స్థానికంగా నెలకొన్న సమస్యలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ హెడ్‌క్వార్టర్‌గా ఉన్న గ్రామంలో డ్రైనేజీ, రహదారుల సమస్య నెలకొనడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కాలనీలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే మున్సిపాలిటీకి వెళ్లే ప్రధాన రహదారి పనులు ఇప్పటికే ముగిశాయని, ప్రస్తుతం డ్రైనేజీ పైపులైన్ పనులు కూడా జరుగుతున్నాయన్నారు. ఈ పనులు పూర్తయ్యాక అన్ని వీధుల్లో కొత్త రహదారులు వేయించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన గ్రామ శివారులో ప్రైవేట్ బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభించారు.



బల్దియా.. ఇది భావ్యమేనా?

మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కొలనును నిమజ్జనం కోసం అధికారులు సిద్ధం చేస్తున్నారు. కొలనులో ఉన్న బురదను తీసి శుభ్రమైన నీటిని నింపేందుకు జీహెచ్ఎంసీ, కాంట్రాక్టర్‌కు పనులు అప్పజెప్పింది. సదరు కాంట్రాక్టర్ నిమజ్జను కొలనులోని బురదను జేసీబీ సహాయంతో తొలగించి చెరువులో వేస్తుండడంతో చెరువు కలుషితంతో పాటు పూడుకుపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. -మన్సూరాబాద్

చెట్ల నరికివేతపై ఫిర్యాదు

హస్తినాపురం: నాగార్జున సాగర్ రోడ్డు పక్కన ఉన్న పంచాయతీ రాజ్ టీచర్స్ కాలనీలో ఏపుగా పెరిగిన భారీ చెట్లును నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం ఇబ్రహీంపట్నం అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సెంటర్ ఫర్ సోషియో కల్చర్ అండ్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ సెక్రటరీ వి.సన్ని హెరాక్లియస్ అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో పెరిగిన చెట్లను ఇష్టానుసారంగా నరికి వేస్తున్నారని సంబంధిత అధికారులు చెట్ల పరిరక్షణకు పాటుపడాలన్నారు.

బొడ్రాయికి పూజలు

పహాడీషరీఫ్: మున్సిపాలిటీలోని మామిడిపల్లి గ్రామంలో ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించిన బొడ్రాయి విగ్రహ మండల పూజలు గురువారం ఘనంగా జరిగాయి. విగ్రహ ప్రతిష్ఠాపన జరిగిన 41 రోజులు పూర్తయిన సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఉదయం గణపతి హోమం, పుణ్యాహవచనం, పాల, పుష్ప, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. శివకుమార్, పవన్‌కుమార్, నందీశ్వర్, గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గురువులకు వందనం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. న్యూనాగోలు సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న, రిటైర్డ్ హెడ్ మాస్టర్ అనుమల హరేందర్, మరో రిటైర్డ్ హెడ్ మాస్టర్ లక్కరాజు రవీందర్‌ను సన్మానించారు. మోహన్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు యాశ్పాల్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాలలకు రోజూ బస్సులో ప్రయాణించే ఉపాధ్యాయినులను దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్ సమత, అసిస్టెంట్ మేనేజర్ వెంకన్న ఆధ్వర్యంలో గులాబీ పువ్వులిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. -చైతన్యపురి/నాగోలు/చంపాపేట



బస్సులో ప్రయాణించే టీచర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న డీఎం సమత



మోహన్‌నగర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు



న్యూనాగోలు సీనియర్ సిటిజన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం



జైపురికాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం



కర్మన్‌ఘాట్ శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాలలో..